

# జూనియర్

నటరాజ్

స్టేషన్‌కి మామయ్య రావడం నాకు లభించిన గొప్ప గౌరవపురస్కారంగా భావించాను. విశాఖపట్నంలో అడుగు పెట్టిన క్షణంనుంచీ నేను చాలా సంతోషంగా వున్నాను. చాలా బిజీలో వుండి కూడా నన్ను గుర్తుంచుకుంటూ, వాటిలో యేదో ఒక మూలకి తీసుకెళ్తూ నా సంతోషాన్ని మరింత యెక్కువ చేస్తున్నాడు మామయ్య. నిజానికి నేను బంధువుల్ని అంతగా లైక్ చెయ్యను వారి సాంప్రదాయాలను, భావాలను మనకి ఇష్టం లేకుండా మనపై రుద్దుతారు అని నా కోపం. అమ్మ బలవంతాన వచ్చాను. వచ్చినప్పటినుంచీ మామయ్య చూపిస్తున్న ఆదరణ, స్నేహపూర్వకమైన భాషణ, నన్ను మామయ్య అంటే గొప్ప గౌరవపూర్వకమైన ప్రేమను కల్గించేలా చేశాయి. నాకు చాలా స్వేచ్ఛనిచ్చాడు. నిజానికి యువకులు యేమి కోరుకుంటారో, యెలా మెలగాలని అభిలషిస్తారో, అన్నీ మామయ్యకు బాగా తెలిసినట్లు తోచింది. దాంతో మామయ్య నాలాటి కుర్రవాడు అయితే నాకొక గొప్ప స్నేహితుడు అయ్యేవాడు కదా! అని విచారం కలిగింది.

మూడురోజులు గడచిపోయాక నాకు కూడా సరదాగా తిరగడాలపై మోజు తగ్గింది. యిక్కడికి వచ్చిందెందుకంటే పని నేర్చుకోవడానికి, మామయ్యకు సాయపడటానికీనూ. శ్రద్ధగా పొద్దున్నే డార్క్‌రూమ్‌లోకి ప్రవేశించాను అప్పటికే మామయ్య అందులో వున్నాడు. నాకు దిగ్భ్రమ కలిగింది. అంతేకాదు చాలా పశ్చాత్తాపం కలిగింది. "యేంరా!" అన్నాడు మామయ్య. "యేం లేదు మామయ్యా యీవేళనుంచి డార్క్‌రూమ్ నాది" అన్నాను. నెగిటివ్‌లు కడుగుతూ మామయ్య.. "ఓహో ఇప్పుడే యెందుకు

లేరా చీకటికొట్టు? అప్పట్లోరే బాగా డెవలప్ అయ్యానంటే కడగడానికెంతసేపు?" అన్నాడు.

"అప్పట్లోరా? అమ్మో... పొరపాటున ఫ్లాష్ అయితే యింకేమన్నా వుందా కొంపలు మునగవూ?" అన్నాను.

"అధైర్యం కూడదురా నాన్నా! మన కిష్టమైన ప్రదేశాలు జ్ఞాపకముకో ఓపిగ్గా తీసుకుంటానికి ఒకటిపోతే మరొకటి తీసుకుంటానికీనూ అయితే అలవాటూ, శ్రద్ధా మనల్ని పరిణతుల్ని చేస్తాయి. నీ మనస్సులో వేరే ఆలోచనలు వుండ కూడదు నీ దృష్టి అంతా దృశ్యంమీదనే కేంద్రీకరించాలి. అప్పుడు నువ్వు మంచి ఫోటోగ్రాఫర్ అవ్వగలుగుతావు. అప్పుడు నిన్ను ప్రెస్ ఫోటోగ్రాఫర్‌ని చేయడం యెంతలోకి?" అన్నాడు.

"చాలా థాంక్స్ మామయ్యా, నా గురించి చాలా శ్రద్ధతీసుకుంటున్నావు" అన్నాను అభిమానపూర్వకమైన సిగ్గుతో.

"యిందులో శ్రద్ధయేమున్నదిరా? నా మేనల్లుడికి చేసుకోక యెవరికి చేసుకుంటాను యేమైనా? నువ్వు అభివృద్ధి చెందితే నాకు అంతకన్నా కావలసిందేముంది? నేను చెప్తున్నవన్నీ మనసులో పెట్టుకుంటూ వుండు యేదైనా ఆడుతూ పాడుతూ నేర్చుకుంటేనే ఆనందం. ఓకే?"

"అలాగే మామయ్యా!" అన్నాను.

మళ్ళా మామయ్యే అన్నాడు.

"సారీరా! నీకొక సంగతి చెప్పడం మరిచిపోయాను. మీ అమ్మ నువ్వు సంఘాల్లో తిరిగి పాడవుతున్నట్టు రాసింది." అన్నాడు.

ఒక్క క్షణం నేను అలాగే వుండి పోయాను. 'సంఘాల్లో తిరగడం మామయ్య దృష్టిలో డిస్‌క్వాలిఫికేషనా?' నాకు కోపం కూడా వచ్చింది. ఆ డార్క్ రూమ్‌లో కూడా కుంచించుకున్న నా కళ్ళు కనిపించాయి కాబోలు, మామయ్యే తిరిగి అనునయంగా.

"సరేలే! అదేమీ తప్పుకాదులే. మన మేధస్సుని అభివృద్ధి చేసుకునేందుకు సంఘాలూ, పుస్తకాలూ చాలా మంచివే. ప్రజాసేవ అంటూ ప్రత్యేకంగా యేమీ వుండదు-! మనకి భుక్తి పెడుతున్న రంగంలో మనం చేస్తున్న కృషే ప్రజాసేవ" అన్నాడు.

"అలాగే మామయ్యా" అన్నాను చేసేదేమీలేక. "మేధస్సు అభివృద్ధికి సంఘాలూ, పుస్తకాలూ" అన్నమాట నా చెవుల్లో తిరుగుతూంది.

'అంటే అవన్నీ మన స్వార్థానికా? బలేగా అంటున్నాడే మామయ్య!' అనిపించింది. 'మన కృషే ప్రజాసేవ' అని కూడా అంటున్నాడు. మొత్తానికి మామయ్యలో భగవద్గీత భావాలు చాలా వున్నాయి. అవి నేను అనుభవపూర్వకంగా యీరోజే తెలుసుకున్నాను.

డ్రాయింగ్ రూమ్‌లో పేపరు చదువుతుంటూ కూర్చుంటే అత్తయ్య టీ యిచ్చింది. తాగుతూవుండగా ఫోన్ మోగింది. నేను తీసుకుందాము అనుకుంటంలోనే మామయ్య రిసీవర్ యెత్తి యేదో అడ్రసు నోటుచేసుకుని ఫోన్‌పెట్టేస్తూ "వొరేయ్ వస్తావా అవుట్డోర్‌కి?"

నాకు వుత్సాహం కలిగింది. నేను వెంటనే సంతోషంతో లేచి బయలుదేరుతుంటే మామయ్య పకపకా నవ్వేస్తూ "అవుట్డోర్ అంటే యెక్కడికను కున్నావ్?" అన్నాడు.

"యేదైనా రిసెప్షనా? మీటింగా?" అన్నాడు.

మామయ్య మరింతగా నవ్వుతూ, రిసెప్షనూ కాదు, మీటింగూ కాదు, సెండాఫ్!"

"సెండాఫ్ అయితే మాత్రం యింత నవ్వెందుకు?" అన్నది అత్తయ్య.

"యిది మామూలు సెండాఫ్‌కాదు... శ శవం... శవాన్ని ఫోటోతియ్యాలి."

నా క్కూడా కిసుక్కున నవ్వు వచ్చింది.

అత్తయ్య మాత్రం కోపగించుకుంది. "చాల్లెండి బాబాయి మొట్టమొదటి అవుట్‌డోర్ యిదా? వద్దు!" అన్నది.

నాక్కూడా వెళ్ళాలని లేదు. కానీ "పదవోయ్ నువ్వేం తియ్యొద్దులే.... తీసినామాత్రం చచ్చినోడికి కలెక్కొచ్చొచ్చుస్తుంది గానీ, నువ్వు పక్కనుండు" అంటూ బయలుదేరాడు.

కెమెరా పట్టుకుని నేనూ బయలుదేరాను.

మేం వెళ్ళేసరికి శవందగ్గర యేడ్పులూ మొత్తుకోళ్ళూ కనిపించాయి. చనిపోయింది బాగా వృద్ధుడు. యెందుకట్టెలా వున్నాడు. ఫొటో తీస్తానికి కుర్చీలో కూర్చోబెట్టమన్నాడు మామయ్య. కానీ ఆ శవం అప్పటికే కర్రలా బిగుసుకుపోయింది. కుర్చీకి ఆనుకుని విలుమంది శవం. అటూ యిటూ పట్టుకున్నారిద్దరు కుర్రాళ్ళు అంతలోనే శవం దామ్మని కిందపడిపోయింది. నాకు పక్కున నవ్వువచ్చేసింది అయినా ఆపుకున్నాను. యెట్టకేలకు కీళ్ళు గట్టిగా వంచి కుర్చీలో కూలబెట్టారు. కానీ మెడ నిలవడం లేదు. అలాగే ఫొటోలు తీస్తే అతగాడి మొహం పడదు బుర్రమాత్రమే పడుతుంది. మెడకింద గుడ్డని వుండలా చేసి పెట్టాడు మామయ్య. శ్రద్ధగా ఫొటో క్లిక్ మనిపించాడు.

తిరిగివచ్చేస్తుంతగా. "యేరా యేం అబ్జర్వ్ చేశావు అక్కడ?" అన్నాడు మామయ్య.

"యేం అబ్జర్వేషనోగానీ నాకు చెప్పలేనంత నవ్వు వచ్చింది మామయ్యా" అన్నాను.


"వొరేయ్ .... నీకేమిటిరా నవ్వు? నాకూ వచ్చింది. కానీ నేను నవ్వానా? ఫోటో బాగా రావడమే నాకు కావలసింది.

వారు అడిగిందదే. నే వదేచేస్తాను. అంతే గానీ అక్కడ యెవరు నిజంగా యేడుస్తున్నారు? యెవరు యే విధంగా ప్రవర్తిస్తున్నారు? అన్నవి నాకు అనవసరం... యేమంటావు? గీతలో యేం చెప్పాడు?"

మామయ్యతో బలవంతంగా యేకీభవించక తప్పలేదు నాకు. నేను తీసిన ఫోటోలు యిప్పటిదాకా యెన్నో బహుమతులు గెల్చుకున్నాయి. ఆ ఫోటోల్లో నేను చూపించిన కళ యేమిటంటే సబ్జెక్టు యొక్క బాక్‌గ్రౌండ్. నా వుద్దేశ్యంలో సబ్జెక్టుకు దాని వెనుకవున్న బాక్‌గ్రౌండ్, వెలుగునీడలవల్ల కళ వస్తుంది. పీటిలో మామూలుగా తీసిన పడవకంటే సూర్యోదయంలో తీసిన పడవ అద్భుతంగా వస్తుంది. గోవుల్ని మామూలుగా ఫోటో తీసినప్పటికంటే అవి ధూళిలో నడుస్తున్నప్పుడు తీస్తే జీవం ప్రతిఫలిస్తుంది. అందాన్ని ప్రకాశంగా తీయాలన్న భావన వున్న నాకు మనుషుల్ని కుర్చీల్లో కూర్చోబెట్టి, మొహం అటు తిప్పండి, యిటు తిప్పండి, కొంచెం గడ్డం యెత్తండి, జడ వాలుగా తీసుకోండి అని చెప్పి చిత్రహింసలు పెట్టడం, తీరా ఫోటో తీసే సమయానికి వాళ్ళు కదిలిపోవడం, లేదా కళ్ళు మూసుకోవడం, ముఖాలు వేల్లాడేయడం యివన్నీ నా మనసును రంజింపచేయడంలేదు. అయినా యిది వృత్తిగా తీసుకున్నాను గనుక తప్పదు.

నేను కొంచెం బోరుగా ఫీలవుతున్నట్లు మామయ్య కనిపెట్టాడు. ఆనాడు సాయంకాలం నాకోసం అవి కొత్త ప్రోగ్రాం వొకటి సృష్టించుకు తెచ్చాడు. స్థానిక పత్రికలో యేదైన ఫోటో ఫీచర్ రాయాలిట. "దేనిమీద రాస్తావో, యేం రాస్తావో నీ యిష్టం" అని నిర్ణయం నా మీదనే స్వేచ్ఛగా వదిలేశాడు. నాకుచాలా సంతోషం కలిగింది.

అప్పుడే నాలుగైదు రోడ్లు బాగా తిరిగాను. దేనిమీదరాయాలో నాకు తట్టలేదు. అలాగే జగదంబ జంక్షనులో నిలబడితే వొక వూహ వచ్చింది. నాకు బాగా నచ్చిన సంగతి యేమంటే యిక్కడ యువకుల్లో దాదాపు అందరూ వ్యాయామం చేస్తారు. విశాఖపట్నంలో యించుమించు ప్రతిపేటకూ వొక వ్యాయామ కళాశాల వుంది. బక్క చిక్కి, వూసురోమంటున్న యువకులెవరూ నాకు కనిపించలేదు. కనిపించినా వారెవరూ యిక్కడివాళ్ళు కారు అని నాకు అనిపించింది. నాలుగురోజులూ వూరిమీదపడి తెలుసుకున్న విషయాల్లో యివొకటి. వ్యాయామ కళాశాలలకు వెళ్ళగానే వారు సాదరంగా ఆహ్వానించారు. ఎన్నో వివరాలు చెప్పారు. కొంత మంది యువకుల ఫోటోలు తీసుకున్నాను. వివరాలు అందరిదగ్గరా తీసుకుని వ్యాసంగా రాశాను. ప్రభుత్వం వ్యాయామ కళాశాలల్ని ప్రోత్సహించవలసిన అవసరాన్ని గట్టిగా రాశాను. అయితే నాకు నచ్చని రెండు విషయాలు యిక్కడ




వున్నాయి. అవేమంటే యీ కళాశాలల్లో ఆంజనేయ పూజలు లాంటివి తప్పని సరిగా చేయవలసి వుంది. కొందరు కుల పిచ్చివున్నవారు వున్నట్లు తోచింది. నాకివి రెండూ యిష్టముండవు. మొదటిదానివల్ల వొక క్రిష్టియనుగానీ, వొక ముస్లింగానీ నేర్చుకుంటానికి రాలేరు కదా! యీ మాటే మరొకదంగ్లాలోని కుర్రాళ్ళతో నేనంటే వొక కుర్రాడు "క్రిష్టియన్స్ మాత్రం యంగ్ మెన్స్ క్రిష్టియన్స్ అసోసియేషన్స్ పెట్టుకోవడంలేదా? అక్కడ కూడా యీతలు గానీ, కరాటేలు గానీ నేర్చుకునేటప్పుడు వారూ వారి భగవంతునికి మేము విధేయులముగా వుండాలని అనుకుంటున్నారు కదా!"

దానికి నేను సమాధానమేమీ యివ్వలేదు. నాకు నచ్చనిది కాగితంమీద పెట్టడం తప్పితే వాద ప్రతివాదాలు నాకు యిష్టంవుండదు. వాదంవల్ల ప్రతివాదం మొండి తేరుతుంది. వీళ్ళందరూ వ్యాయామాన్ని మతైకం యెందుకు చేస్తారో నాకు తెలుసు. కానీ పౌరుషవంతులైన యువకులకు వీటిన్ని యెందుకు పాటించాలన్న జిజ్ఞాస యెందుకు కలగదో నాకు ఆశ్చర్యం వేస్తుంది, సెక్యులర్ భావాలు ప్రజలలో కలగకపోతే సమైక్యత యెలా సిద్ధిస్తుంది? యిదీ నా ఆవేదన. యిక రెండో విషయం తలచుకుంటే నా తల సిగ్గుతో వంగిపోతుంది. అది కులం. సహజమైన శక్తి రానికి యీ కులాన్ని ఎలా అంటించుకుంటారు? ప్రాచీనులు సరే పోనీ నవీనులూ, చైతన్యవంతులూ అయిన యువతులు మేము రెడ్లిలమూ, మీరు రెడ్లూ, వారు యాధవులూ అని అనుకోవడం తమ ఆత్మగౌరవ వినాశనంగా

యెందుకు భావించరు? యీ విషయాల్నే వుటంకిస్తూ నా భావాల్ని చివరిలో ప్రవేశ పెట్టాను.

నే నే మాటల్నయితే ప్రాణంగా భావించానో వాటిల్నే మామయ్య, అడ్డంగా కొట్టివేశాడు. "నువ్వు జర్నలిస్టువి కాబోతున్నావు. అంతే. జర్నలిస్టు వాస్తవాల్ని చూస్తాడు. అంతే. అదే రాస్తాడు. దాన్ని మార్చేవాళ్ళు వేరు. 'పూజలు చేస్తారు' అని మాత్రమే రాయాలి నువ్వు. 'పూజలుచెయ్యకూడదు' అనడానికి నువ్వెవరివిరా చిట్టితండ్రీ? యెనీహౌ నీ ఫీచర్ చాలా బావుంది." అని మెచ్చుకున్నాడు.

రెండురోజులు పోయాక అది అచ్చు అయింది. సంతోషం కలిగింది గానీ సంతృప్తి కలగలేదు. యీ జర్నలిజం నా వంటికి సరిపోయేట్టులేదు. కానీ ఏం చెయ్యను? పోనీ యేం చెయ్యాలి?

రాజకీయనాయకులు వస్తే వారిచుట్టూ తిరగాలి. వాళ్ళు విలాసంగా నవ్వుతుంటే ఫోటోలు తియ్యాలి. దారినపోయే ముసలమ్మలను పిలిచి కౌగలించుకుంటూ వుంటారు. ముష్టివాళ్ళ కన్నీళ్ళు తుడుస్తూ వుంటారు. దండలమీద దండలు వేయించుకుంటారు. కెమేరావేపు చూసి యెదవ నవ్వులు నవ్వుతుంటారు. ఇవన్నీ కెమేరాలో బంధించాలి. వుచితానుచితాలూ, నిజానిజాలూ, హృదయపు నిజాయితీ యివేమీ ఆలోచించకూడదు. అలా ఆలోచించినవాడెవ్వడూ వారికి ఫోటోలు తియ్యలేడు. లేకపోతే రాజకీయనాయకుడు యేరోప్లేన్లోంచి దిగి ముసలమ్మను కౌగలించుకుంటమేమిటి? ముష్టివాడి కన్నీళ్ళు తుడవడమేమిటి? అంత ప్రేమా సానుభూతి పేదవాళ్ళపై వున్నవాడు రాజకీయనాయకుడు అవ్వడు. వారి ద్వారా లబ్ధిపొందాలనుకునేవాళ్ళే యిటువంటి చౌకబారు వేషాలు వేస్తారు.

నా అసహనం మామయ్య కనిపెడుతూనే వున్నాడు. పాపం ఆయన మటుకు యేంచేస్తాడు? తనకున్న పరివరాల్లో సర్వవిధాలా తన గురించి పనిచేస్తున్నాడు, ప్రోత్సహిస్తున్నాడు. మామయ్యతో నా హృదయంలో రగులుతున్న భావాల్ని చెప్పుకోవడానికి కొద్దిగా భయమే నాకు. కానీ ఆరోజు యెపుడువస్తుందో దాని పర్యవసానమేమిటో నేను వూహించగలను. కానీ ఆ వూహ యిప్పట్లో రాకూడదని మాత్రం గట్టిగా గుండెని నొక్కుకున్నాను.

కానీ నా గుండె బద్దలయ్యేరోజు వచ్చింది. నేను పనిచేసిన సంఘంలోనే హోల్‌టైమర్‌గా పోవాలన్న తలంపు రోజురోజుకీ వుధృతం కాసాగింది. అందుకు కారణం యిప్పుడు నేను చేస్తున్న వృత్తిలోని కృతకత్వమే.

నిన్న జరిగిన సంఘటనలు నా వుడుకురక్తాన్ని రెచ్చగొడితే, మామయ్యకు అశనిపాతమూ అప్రదిష్టా

తెచ్చాయి. అటువంటి పని నే నెందుకు చేశాను? అవి ప్రశ్నవేసుకుంటే దానికి సమాధానం నాదగ్గర లేదు. రెండు అక్షరాల్లో చెప్పాలంటే కసి. నాలో నాకే కసి.

చీమూ నెత్తురూ వున్న యెటువంటి వాడికైనా ఆ పన్నివేశం ఛీత్కారం కలిగిస్తుంది. పిడికిళ్లు బిగుసుకుంటాయి.

నిన్నరాత్రి బాగా వురుములు, మెరుపులు ఈదురుగాలులతో వర్షం కురిసింది. విశాఖ వచ్చాక వర్షం ఆదే ప్రథమం. యెండి బీటలువారిన భూమిని యీ వాన యెంతో సేదదీరుస్తుంది కదా అని సంతోషిస్తూ పడుకున్నాను. కానీ యీ వర్షపు రాత్రే వొకరి యింటిలో కాళరాత్రి అని మృత్యురాత్రి అనీ వూహించనేలేక పోయాను. తెల్లారి బద్ధకంగా లేస్తుంటే ఫోనుదగ్గర మామయ్య మాటలు వినబడుతున్నాయి.

"టెలిగ్రాఫ్ తీగలేమైనా తెగాయా? నీకు తొడలలోతుదాకా వచ్చిందా? యెన్ని పూరిళ్ళు మణిగాయి?" హాస్యయుతంగా అడుగుతున్నాడు మామయ్య. మరి కాసేపటికి "ఆఁ" అన్న ఆశ్చర్యార్థకం తరువాత వెంటనే "వారేయ్ మేనల్లుడూ" అన్న కేక వినిపించేసరికి గబుక్కున లేచి కూర్చున్నాను. "యేంటిమామయ్యా" అన్నాను.

బీచ్‌దగ్గర స్లమ్‌లో గోడ కూలి ఒకడు చచ్చిపోయాట్టరా, తొందరగా నువ్వు బట్టలేసుకుని బయలుదేరు. ఎమ్మెల్లేలూ, కార్పొరేటర్లూ, మేయరూ, తాసీల్దారూ, కలెక్టరూ గట్రా పొలోమవొచ్చేస్తున్నారంట.... తొందరగా వెళ్ళు.... మినిమమ్ పది స్నాప్స్ అయినా పడతాయి" అన్నాడు.

అయిదు నిముషాల్లో నే నక్కడ కెమేరాతో ప్రత్యక్షమయ్యాను. అప్పటికెవరూ రాలేదక్కడికి. మనుషులు మాత్రం చుట్టూ మూగారు. భార్య స్పృహతప్పి పడివుంది. ఆరుసంవత్సరాల బిడ్డ దిక్కులు పిక్కటిల్లేలా యేడుస్తూంది. తండ్రి శవం అరుగుమీద వుంది. ఆ బిడ్డ శోకం నా గుండెల్ని కదిల్చివేసింది. యింతకీ కూలిన గోడ వీళ్ళది కూడా కాదు. అది పక్క భవనంవారి ప్రహరీగోడ. అది చాలా పూర్వకాలంనాటి గోడ. అది కూలితే చచ్చేది మనంకాదు కదా అన్నట్టు వాళ్లు పెచ్చులూడుతున్న గోడని అలాగే వదిలేశారు. దాని కానుకుని అనేకమంది పేదలు గుడిసెలు వేసుకున్నారు. గోడంతా కూలితే చాలామంది చచ్చిపోయి వుండేవారు. భవనంలోంచి ఆ భవనపు యజమానీ ఆతని భార్యా పిల్లలూ అనుకుంటూ భవనంమీంచి కిందకి విచిత్రంగా చూస్తున్నారు. నాకు కడుపు రగిలిపోయింది. కానీ యేం చెయ్యను? నా చేతిలో వున్న ఆయుధం వొక్క కెమేరాయే. దూరంగా వెళ్ళి పైనవారూ, కింద శవమూ కూడా పడేట్టు స్నాప్

లాగాను. మరొక అరగంట తరువాత పెద్దదొరలవార్లు వొక్కొక్కరే కార్లేసుకు దిగడం ప్రారంభించారు. బడా నాయకుడు వచ్చేసరికి (యీ నాయకుడెవరూ అనకండి, అయన యెమ్మెల్లే కావచ్చు, మేయరు కావచ్చు, యిళ్ళస్థలాల చైరుమేను అవ్వచ్చు) కార్యకర్తలకి స్పృహవచ్చి ఏడ్వసాగింది.

పెద్దదొరగారు ముందర శవాన్ని చూడలేదు. ఆమెను వోదార్చలేదు. యేడుస్తున్న బిడ్డ కన్నీటిని తుడవలేదు. అయన నోటమ్మటనుంచి వొచ్చిన మొట్ట మొదటి వాక్యం "ఫొటోగ్రాఫరు వచ్చాడా?"

నా గుండె తీవ్రంగా కొట్టుకుంది.

"వచ్చాడండీ వచ్చాడు, పెద్దాయన రాలేదు, అయన మేనల్లుట్ట వచ్చాడు."

"యెవడైతే మనకేటి బాగా తీస్తాడా?"

"తీస్తాడేమోనండి. యేమయ్యోయ్ కుర్రగుంటడికిమల్లే వున్నావు, ఫొటో బాగా తియ్యగలవా?"

నా ఫొటోసంగతి నేను చెప్పుకోవాల్సిన అగత్యం పట్టినందుకు వళ్లు దహించుకుపోతోంది. కెమేరా వొక్క విసురున నేలమీద కొట్టేద్దామన్నంత కోపం వచ్చింది. కందగడ్డలా అయిన నా ముఖంలోని భావాలు ఆ శవాలకి అర్ధం కాలేదు.

ఆ పెద్దదొరవారి నోటమ్మట వచ్చిన రెండోవాక్యం "దండ తెచ్చారా?"

"తెచ్చామండీ, తెచ్చాము" అంటూ వొక దండ అయన చేతికి అందించారు భటులు.

"శవానికి దండలేస్తూండగా ఫొటో తియ్యాలి. తెలిసిందా!" అన్నాడు హెచ్చరికగా.

లైన్లో పెట్టుకున్నాను. క్లిక్‌మనిపించి నిట్టూర్చాను. నా నిట్టూర్పు యింకా గాలిలోకి వెళ్ళనేలేదు, శవం మెళ్లో వేసిన దండని గార్పొరేటరుగారు తీసేశారు. తీసేసి నావంక చూసి "వూ కానియ్యమన్నాడు" ఆ శవం మెడలో అదే దండ వేశాడు.

నేను కళ్ళింతలు చేసుకుని అలా చూస్తుండిపోయాను. అతను గట్టిగా అరిచేసరికి ఉలిక్కిపడి యీ లోకంలోకి వచ్చి దెయ్యంపట్టినట్టుయి అతగాడు కోరుకున్నట్టే తీశాను.

అలా వొకళ్ళా యిద్దరా దాదాపు పదిమంది పెద్దదొరలు ప్రభువులకు వొకే వొక దండతో అందరూ వేస్తున్నట్టు తీశాను. నా బుర్ర పనిచేయడం లేదు. అలా ఫొటో తియ్యడం, అది శవం మెళ్లోంచి తీసి మరొకరు వెయ్యడం. వారికి తిరిగి ఫొటో తియ్యడం. చేతులు మాత్రం క్లిక్‌మనిపిస్తున్నాయ్. యింత క్రూరమైన అపహాస్యం యింకెక్కడైనా వుంటుందా? దొంగలంజకొడుకుల్లారా? అని బిగ్గరగా తిట్టాలనిపించింది. పైగా మరొక నటన.... ఆ పసిబిడ్డ గద్దం



పట్టుకుని ఓదారుస్తున్నట్టుగా ఫోటో, కళ్లు తుడుచుకుంటున్నట్టుగా ఓ ఫోటో .... యీ భయంకరమైన హిపోక్రసీని తట్టుకునే ఆత్మస్థయిర్యం నాలో బదా బదలైపోయింది.

"సాయంకాలంకల్లా ఫోటోలు రెడీ అయిపోవాలి. రేపొద్దుటికల్లా పేపర్లో పడాలి.... తెల్సిందా? పేపర్లోకన్నా ముందర ఫోటోలు ముందర మనదగ్గిరికి చేరాలి.... తెల్సిందా?" ఆర్డరు జారీచేసి పెద్ద రాజకీయనాయకుడు అందరికీ దండాలు పెట్టి కారెక్కి వెళ్ళిపోయాడు. యింకా పేపర్లో సామంతనాయకులందరూ జారుకున్నారు.

ఆమె యేడుస్తూనే వుంది. ఆ బిడ్డ యేడుస్తూనే వుంది. దిక్కులేని ఆ తల్లి మాతృత్వ కష్టం గొప్పవాళ్ళకు కేక్ అయింది. గుండె నులిమివేసినట్టుగ అయింది.

యింటికి వచ్చేసరికి మామయ్య లేడు. ఏదో పనివుంది అనకాపల్లి వెళ్లాడుట.

డార్క్‌రూమ్‌లోకి వెళ్ళానేగానీ అది కదగటం నాకు యిష్టంలేకుండాపోయింది. జరిగిన సంఘటనలన్నీ కళ్ళకు కట్టినట్టయి మోసం, ద్రోహం, పచ్చి దుర్మార్గం అని అరవాలనిపిస్తూంది. దొంగముండా కొడుకుల్లారా అని తిట్టాలనిపిస్తూంది. వాళ్ళ నటనే యింకా యిప్పుడు నా కెమెరాలో దాగివుంది. ఆ దొంగనటనా ఫోటోలన్నీ వాళ్ళు గంపెడాశలు పెట్టు

కున్నారు. 'వాళ్ళ ఆశల్ని అడియాశలు చేస్తే?' యీ ఆలోచన నన్ను పిచ్చి వాడ్ని చేసింది. 'అది వొక్క క్షణం పట్టదు.... యేమైతే అది గానీ' అనుకుంటూ కెమేరాతో బయటకివచ్చి ఎర్రని ఎండలో రీలు బయటికి తీసేశాను. యేమయింది. ఫినిష్....అంతా స్మాష్ అయింది. వొక్క ఫొటో కూడా పడదింక. వాళ్ళ దొంగసామభూతుల్ని చంపేశాను. వాళ్ళ స్వార్థాల్ని మట్టుపెట్టేశాను. గుండె దడదడ కొట్టుకుంటూంది.

మూడింటికల్లా మామయ్య వచ్చాడు మామయ్య వచ్చిన పావుగంటకల్లా దొరలు పంపిన మనుషులు వచ్చారు ఫొటోలకోసం.

మామయ్య కేకవేశాడు. "ఫొటోలు కడిగేశావా? యేవీ పట్టుకురా?"

నాలో స్పృహలేదు. గుండె అలాగే కొట్టుకుంటూంది. మామయ్యే విసుగులో లోపలికి రాగా ఫొటోలు అన్నీ పోయినట్టు చెప్పాను. మామయ్య నిరుత్తరుడై పోయాడు. కడిగిన నెగెటివ్ విడదీసి వెలుగులో పెట్టి చూసి "అంత తెలివి తక్కువగా యెలా బయటే ఫిలిమ్ వోపెన్‌చేశావురా? నువ్వసలు ఫొటో గ్రాఫరువేనా? నేనిప్పుడు వాళ్ళకేమని సమాధానం చెప్పాలి?"

నా కసియొక్క ప్రభావం మామయ్యను బాధపెడుతూంది. ఆయనకది పరువుప్రతిష్ఠల సమస్య. అప్పటికి వారితో యేదో చెప్పేసి పంపించేశాడు.

సాయంకాలంకల్లా మరికొందరు పెద్ద మనుషులు దిగారు. అవి పోయినట్టు విని వాళ్ళు కోపంతో మండిపడ్డారు. నానా తిట్లూ తిట్టారు మామయ్యని.


మామయ్యకళ్ళు అగ్నిగోళాలయ్యాయి. వారు వెళ్ళిపోయాక నన్ను నిలదీశాడు.

"యేరా! అసలేమిజరిగిందో చెప్పు. నువ్వు తెలివితక్కువవాడివి కాదు.... యేదో జరిగింది.... యేమిటో చెప్పు.... దాపరికం వద్దు.... చెప్పరా!"

నా కళ్ళల్లో గిర్రున నీళ్లుతిరిగాయి. గొంతు వణుకుతుండగా అక్కడ జరిగిన సంగతులు అన్నీ చెప్పాను.

అంతా విని "సరే అయితే యేమిటంటా? రాజకీయనాయకులు అలా వుండక ఎలా వుంటారనుకుంటా? యింతకీ ఫిలిమ్ యెట్టాపాడైందని చెప్పమంటుంటే యీ సొల్లంతా చెప్తావేంటి నాకు?"

ఆవేశంతో వళ్ళుతెలియలేదు నాకు. "నేనే ఆ ఫిల్మని యెండలో వోపెన్ చేసేశాను. కావాలనే చేశాను. లేకపోతే వాళ్లు పేదవాళ్ళని బొమ్మలుగా వుపయోగించుకుంటారా? ఆ ప్రహారత్వాన్ని, అబద్ధాల్ని, అపహాస్యాన్ని నేను భరించలేను మామయ్యా. నేను కెమేరావంటి యంత్రాన్ని కాను, చీమూ నెత్తురూ వున్న మనిషిని...."




మామయ్య అలాగే కుర్చీలో తల పట్టుకుని కూర్చుండిపోయాడు. నేను యేడుస్తూ లోపలికి వెళ్ళి యేడుపు తగ్గాక ఒక నిశ్చయానికి వచ్చాను. చిన్న చీటి మీద "నన్ను క్షమించు మామయ్యా" అని వ్రాసి వెయిట్ మీద పెట్టి సూట్‌కేసు పట్టుకున్నాను.

బయటకి వస్తూ తిరిగి ఆ చీటీ కూడా తెచ్చి మామయ్య చేతికిచ్చి గుమ్మం దాటాను. మామయ్య యింట్లోనుండే ఒక్క అరుపు అరిచాడు.

"నాన్నా....ఒరేయ్.... వెళ్ళకు...." అంటూ బయిటికి పరుగెత్తుకుంటూ వచ్చి నా చెయ్యి గట్టిగా పట్టుకుని యింట్లోకి తీసుకెళ్ళిపోయాడు. నేను మామయ్యని గట్టిగా కౌగలించుకుని యేడ్చేశాను.

బాగా రాత్రి అయ్యాక, "నిన్ను బాగా అర్థంచేసుకున్నానురా. కానీ యిటువంటివి యెందగట్టాలంటే ఫొటోని నాశనంచేస్తే అవుతుందిరా.... ఒక టాపిక్‌గా రాయి ....రేపటినుంచీ నీకు యిష్టమైన పనే చెయ్యి. సెంట్రల్ స్కూల్ ఆఫ్ ఫొటో గ్రఫీకి అప్లయ్ చెయ్యి." అన్నారు.

మామయ్య చెప్పిన రెండుపనులూ చేశాను. ఒకటి యిప్పటిదాకా మీరు చదివారు. రెండోది సీటొస్తే నేను చదువుతాను.

